క్లుప్తంగా

మృతిచెందిన ఆవుల ఖననం



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో టోల్ ప్లాజా వద్ద ఆవులను మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వైపు డీసీఎం వ్యాన్‌లో తీసుకెళ్తుండగా బజరంగ్‌దళ్, శ్రీరామదండు నేతలు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. వీటిని భిక్కనూరు పోలీసులకు అప్పగించారు. ఈ డీసీఎంలో 62 ఆవులు, లేగదూడలు ఉన్నాయి. భారీ వర్షం కారణంగా గోశాలలకు తరలించలేకపోయారు. వరద ఉధృతికి గురువారం ఉదయం అందులో ఉన్న ఆవులు మృతి చెందాయి. దీంతో భిక్కనూరు ఎస్సై అంజనేయలు పశువైద్యాధికారి దేవేందర్‌లు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి ఐదు ఆవులను భిక్కనూరు స్మశాన వాటికలో ఖననం చేశారు. మిగత వాటిని మద్దికుంట గోశాలకు తరలించారు.

రైల్వే ట్రాక్ మరమ్మతుల పరిశీలన



భిక్కనూరు: వరదలకు దెబ్బతిన్న రామేశ్వర్‌పల్లి ట్రాక్ మరమ్మతులను రైల్వే ఐజీ రమేష్ నాయుడు, ఎస్పీ చందనా దీప్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే ఐజీ రమేష్ నాయుడు మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని సూచించారు. వారి వెంట రైల్వే డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాధు లింబాద్రి, రైల్వే సిబ్బంది ఉన్నారు.

సిర్‌పూర్‌లోకి వరద నీరు



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్‌లోకి గురువారం సాయంత్రం వరద నీరు రావడంతో 60 మంది గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది తరలించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 60 మందిని డోంగ్లీలోని ఉన్నత పాఠశాలలోని సహాయ కేంద్రానికి తరలించారు. గ్రామంలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని మద్నూర్ ఎస్సై విజయ్ కొండ చేతులపై ఎత్తుకొని సురక్షిత ప్రాంతానికి తరలించారు. డోంగ్లీ, మద్నూర్‌లో సుమారు 500 మంది వరద బాధితులను తరలించారు.

పోచారం ప్రాజెక్టును కాపాడతాం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం ప్రాజెక్టుకు రక్షణ చర్యలు చేపట్టి కాపాడతామని ఓ అండ్ ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్ పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టు వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని గురువారం స్థానిక ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద వివరాలను ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోతకు గురైన ప్రాంతంలో ప్రస్తుతం మట్టిని పోయించి తాత్కాలిక చర్యలు చేపట్టామన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేపడతామన్నారు. ఎస్ఈ సత్యనారాయణ, నాయకులు శ్రీధర్‌గౌడ్, రాంచందర్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, ఏఈ అక్షయ్‌కుమార్ ఉన్నారు.

జలాశయాలకు పోటెత్తిన వరద

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన జలాశయాలకు వరద నీరు పోటెత్తింది. ప్రాజెక్టులోకి గురువారం 2.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 24 వరద గేట్లను ఎత్తి మంజీరలోకి అంతే నీటిని వదులుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు కౌలాస్ ప్రాజెక్టులోకి 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు 7 వరద గేట్లను ఎత్తి మంజీరలోకి అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

తెగిన కల్యాణి ప్రాజెక్టు కట్ట

ఎల్లారెడ్డిరూరల్: కల్యాణి ప్రాజెక్టుకు సంబంధించిన కట్ట తెగిపోవడంతో వరద నీరు మంజీర నదిలోకి పోటెత్తింది. దీంతో కింది ప్రాంతాలలో ఉన్న పొలాలు నీట మునిగాయి.

పోచారంలోకి పెరుగుతున్న వరద

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. గురువారం ఉదయం 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మధ్యాహ్నానికి 27 వేలకు తగ్గింది. సాయంత్రం 43వేలకు పెరిగిన ఇన్‌ఫ్లో.. రాత్రి వరకు 70 వేల క్యూసెక్కులు దాటింది. ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతుండడంతో పరిసర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.



నెమ్లిలోని బోయివాడలో ఇళ్లలోకి చేరిన నీరు



బొమ్మన్‌దేవ్ పల్లి సబ్ స్టేషన్ జలమయం



పుల్కల్‌లో నీట మునిగిన సోయా పంట



వరదతో నిండిన దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామ ఎస్సీ కాలనీ



దెబ్బతిన్న దోమకొండ-సంఘమేశ్వర్ బీటీ రోడ్డు



ఉధృతంగా ప్రవహిస్తున్న బీబీపేట పెద్ద చెరువు అలుగు



బీబీపేట బ్రిడ్జి వద్ద కోతకు గురైన రోడ్డు



నాగిరెడ్డిపేట శివారులోని పంటపొలాల్లో వేసిన ఇసుకమేటలు



బాన్సువాడలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఇళ్ల మధ్యలోకి వచ్చిన వరద నీరు



బోలక్‌పల్లి వద్ద మంజీరను పరిశీలిస్తున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలం

- గతంలో కనీవినీ ఎరుగని రీతిన కురిసిన వర్షం
- ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు
- పలు చోట్ల చెరువులకు గండి.. నీట మునిగిన పంట పొలాలు
- వేల ఎకరాల్లో పంట నష్టం
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- ధ్వంసమైన ప్రధాన రహదారులు.. చాలా చోట్ల రాకపోకలకు అంతరాయం
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన భారీ వాహనాలు
- స్తంభించిన జనజీవనం
- సహాయక చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం



శెట్లూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది



పెద్దకొడప్‌గల్ శివారులో నీట మునిగిన పంటలు



సీతారాంపల్లి- సంఘమేశ్వర్ మధ్య బీటీ రోడ్డు



సంగోజీపేట్ వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగు వరద



తిమ్మారెడ్డిలో నేలమట్టమైన పౌల్ట్రీ ఫాం



లింగంపేట: పెద్దవాగులో చిక్కుకున్న ట్రాక్టర్

సాక్షి నెట్‌వర్క్: రెండు రోజులుగా జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలకు జిల్లా అతలాకుతలమైంది. జిల్లాకు సంబంధించిన అన్ని పెద్ద ప్రాజెక్టుల్లోకి భారీ మొత్తంలో వరద వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని మంజీరా నదిలోకి వదిలేశారు. దీంతో నదీ పరివాహక ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే చెరువులు, కుంటలు నిండి చాలా చోట్ల గండిపడ్డాయి. ఆయకట్టు ప్రాంత పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల చెరువుల అలుగులు ప్రమాదకరంగా పొంగి పొర్లుతున్నాయి. వర్షాలకు మండలాలు, పట్టణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై వరద ప్రవహించడంతో రోడ్లు ధ్వంసమైపోయాయి. ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. అలాగే రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో రైలు రాకపోకలను నిలిపేశారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. వరద ప్రవాహంలో కొంతమంది కొట్టుకుపోగా.. మరి కొంత మంది చిక్కుకుపోయారు. వారిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, స్థానిక పోలీసులు, ప్రజల సహాయంతో రక్షించారు.

బాన్సువాడలో 269 ఎకరాల్లో పంటనష్టం



కోనాపూర్ శివారులో నీటమునిగిన మొక్కజొన్న పంట

బాన్సువాడ రూరల్: ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలో సుమారు 269 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ఏవో ఫయాజుల్లా గురువారం తెలిపారు. తిర్మలాపూర్, బాన్సువాడ, కొల్లూర్, నాగారం, కోనాపూర్, కాద్లాపూర్, తాడ్కోల్, బోర్లం గ్రామాల్లో పంటలు నీటమునిగి నష్టం కలిగింది. వరి 185ఎకరాలు, సోయా 41ఎకరాలు, కంది 28ఎకరాలు, మొక్కజొన్న 15 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందన్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని బిచ్కుంద, తక్కడ్‌పల్లి, రాజుల్లా, పుల్కల్, చిన్నదేవాడ, దడ్గి, గుండెకల్లూర్, సిర్‌సముందర్, హజ్గుల్, శెట్లూర్, మెక్కా గ్రామాలలో పంటలు నీట మునిగాయి. సోయా 1,425 ఎకరాలు, వరి 135, పత్తి 55, మినుము 55, పెసర 25, కంది 150 ఎకరాలలో పంటలు నీట మునిగాయని వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

30 గంటల పాటు విద్యుత్ అంతరాయం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలోని పలు కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ బాక్స్‌లు కిందికి ఉండడంతో వరద నీటిలో మునిగిపోయాయి. ఫ్యూజ్‌లు పోయిన వాటికి మరమ్మతులు చేయడంలో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. దేవునిపల్లి మధురానగర్‌లో ఎంపీడీవో కార్యాలయం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నీళ్లు చేరడంతో బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం మధ్యాహ్నం వరకు దాదాపు 30 గంటల పాటు కరెంట్ లేకపోవడంతో పండుగ పూట కాలనీవాసులు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కామారెడ్డి పట్టణంలోని ఎంపీడీవో ఆఫీసు వద్ద వరద నీటిలో ట్రాన్స్‌ఫార్మర్

జలదిగ్బంధంలో రామేశ్వర్‌పల్లి



రామేశ్వర్‌పల్లిలో వరద పరిస్థితి

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి గ్రామంలో భరత్‌మాత కాలనీ, అంబేద్కర్ కాలనీ, పాలకేంద్రం వీధి, డబుల్‌బెడ్‌రూంలు, గ్రామ పంచాయతీ వీధులన్నీ మునిగిపోయాయి. తాగడానికి కూడ నీరు దొరక్క ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. భిక్కనూరు-రామేశ్వర్‌పల్లి రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

తొమ్మిది మందిని కాపాడిన ఎన్డీఆర్‌ఎఫ్

బీబీపేట: యాడారం గ్రామ చెరువు భారీగా అలుగు పారడంతో కట్టపై 9 మంది చిక్కుకొని సమీప కోళ్ల ఫారంలో రాత్రంతా గడిపారు. ఉదయమే అక్కడకు చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అలాగే బీబీపేట నుంచి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై నుంచి కూడవెళ్లి వాగు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యాడారం చెరువు అలుగు పారడంతో రోడ్డు పూర్తిగా తెగిపోయింది.

బీబీపేట గ్రామ రైతులు వాగుకు అవతలి వైపు చిక్కుకోవడంతో రాత్రంతా ఫంక్షన్ హాలులో గడిపారు. గురువారం ప్రజల సహాయంతో గ్రామానికి చెరుకున్నారు.



యాడారం చెరువు వద్ద చిక్కుకున్న గ్రామస్తులను పడవలో తీసుకొస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది



పోచారం వద్ద కోతకు గురైన రోడ్డు



సలాబత్‌పూర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



పాల్వంచ వాగును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తిమ్మాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



బీబీపేట పెద్ద చెరువు కట్ట పడిన బుంగను పూడ్చడానికి ప్రయత్నం చేస్తున్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలు

భారీ వర్షాలలోనూ నిరంతర సేవలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం సేవలను అందించారు. ఎల్లారెడ్డి మండలంలోని ప్రధాన రహదారుల వెంట వాహనాలు వెళ్లకుండా పోలీసులు గట్టి గస్తీని ఏర్పాటు చేశారు. తిమ్మారెడ్డి పౌల్ట్రీ ఫాంలో చిక్కుకున్న వారిని డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రాజారెడ్డి, ఫైర్ ఆఫీసర్ వినోద్‌లతో పాటు రెస్క్యూ టీం ముగ్గురిని కాపాడారు. మండలంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు సైతం కాలిపోవడంతో నిరంతరంగా శ్రమించి విద్యుత్ పునరుద్ధరణకు డీఈ విజయసారథి ఆధ్వర్యంలో అధికారులు కష్టపడ్డారు. రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామంలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు తగిన చర్యలను తీసుకున్నారు.

పలు చోట్ల కూలిన ఇళ్లు

సాక్షి నెట్‌వర్క్ : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఎల్లారెడ్డి పరిధిలో నాలుగు ఇళ్లు, పెద్దకొడప్‌గల్‌లో రెండు, రామారెడ్డిలో 9, దోమకొండలో 20, భిక్కనూరులో 40 ఇళ్లు కూలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే పలు చోట్ల పండుగ సందర్భంగా వేసిన గణేశ్ మండపాలు కూడా కూలాయి. అధికారులు పరిశీలించి పై అధికారులకు నివేదిస్తామని బాధితులకు చెప్పారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండవద్దని స్థానికులకు తెలియజేశారు.



లింగంపేటలో కూలిన ఇల్లు

రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌దే అధికారం

బాన్సువాడ: రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం బాన్సువాడలో బీఆర్‌ఎస్‌లో చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాన్సువాడలో ఉప ఎన్నికలు తప్పకుండా వస్తాయని.. మళ్లీ బాజిరెడ్డి ఇక్కడి నుంచే పోటీచేయడం ఖాయమని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆగడాలను తట్టుకోలేక కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు చాలా మంది వస్తున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎక్కడ ఇవ్వనన్ని నిధులు బాన్సువాడ నియోజకవర్గానికి ఇస్తే అన్నం పెట్టిన వ్యక్తిని మోసం చేసి అధికారం పోగానే కాంగ్రెస్ పార్టీలో చేరి బాన్సువాడ ప్రజలను పోచారం మోసం చేశాడని వచ్చే ఉప ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని అన్నారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి లాంటి కొండను ముందుగా ఢీకొన్న వ్యక్తి జుబేర్ అని, బీఆర్‌ఎస్ ఆయన చేసిన సేవలు గుర్తిస్తుందని అన్నారు. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు అంజిరెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, జుబేర్, నవీన్, కిషన్, సమీర్, నర్సింలు గౌడ్, సాయిబాబా, మోచీ గణేష్, రమేష్‌యాదవ్, శివ, గాండ్ల కృష్ణ, మౌలాన, సమీర్, నాయిని మొగులయ్య, గులేపల్లి మొగులయ్య, మాధవరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాజిరెడ్డి

సంక్షిప్తం

పాటల సీడీ ఆవిష్కరణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో శ్రీ ఖండేరాయ దేవుని పాటల సీడీని గురువారం వీడీసీ చైర్మన్ గుడ్ల శ్రీకాంత్, విండో చైర్మన్ ప్రభాకర్ రావు ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన మొగుళ్ల నరేశ్ గౌడ్ ఖండేరాయ దేవునిపై రెండు పాటలు స్వయంగా రచన చేసి, పాడినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ రమేశ్, బాలయ్య, వెంకట్ రావు, రాజేందర్, భాను పంతులు, నరేశ్, నర్సింలు, నారాయణ, సత్యనారాయణ, స్వామి పాల్గొన్నారు.

పాలు, కూరగాయలకు కటకట

కామారెడ్డి అర్బన్: కుండపోత వానలతో కామారెడ్డి పట్టణంలో పాలు, కూరగాయలకు కటకట ఏర్పడింది. వినాయక చవితికి పాయసం కోసం అధికంగా పాలు వినియోగిస్తారు. ఎక్కడికక్కడ రోడ్లు తెగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. పాలకు కటకట ఏర్పడడంతో హోటళ్లలోనూ చాయి లభించని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల సరఫరా వ్యానులు పట్టణానికి రాలేదు. ఇలాగే రాకపోకలు ప్రారంభం కాకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశముంది.

కామారెడ్డి–మెదక్ మధ్య నిలిచిన రాకపోకలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు అలుగుపై నుంచి పొంగిపొర్లుతూ దిగువకు ప్రవహించిన వరద తాకిడికి కామారెడ్డి-మెదక్ జిల్లాలను కలిపే రోడ్డు కోతకు గురైంది. ఇరుజిల్లాల సరిహద్దులో మంచిప్ప వాగుపై నిజాంకాలంలో వంతెనను నిర్మించారు. వరదనీటి ఉధృతికి వంతెనకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో రెండు జిల్లా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

తడిసిన రేషన్ బియ్యం

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి వాగు ఉధృతికి వాగు సమీపంలోని కాలనీలోకి వరద నీరు చేరింది. రేషన్ డీలర్ పత్తి లింగం రేషన్ షాపునకు రెండు రోజుల క్రితం సన్న బియ్యం వచ్చాయి. ఆ బియ్యాన్ని సెల్లార్‌లో నిలువ ఉంచారు. సెల్లార్‌లోకి వరద నీరు చేరడంతో బియ్యం తడిసి పోయాయని రేషన్ డీలర్.. తహసీల్దార్ రేణుకా చౌహాన్ దృష్టికి తీసుకురాగా ఆమె షాపును సందర్శించి తడిసిన బియ్యాన్ని పరిశీలించారు. అదే కాలనీలో ఓ వ్యాపారి నిల్వ ఉంచిన వందల క్వింటాళ్ల సోయాబీన్ కూడా తడిసి పోయాయి.

స్లాట్‌లను మార్చుకునే అవకాశం

కామారెడ్డి అర్బన్: కుండపోత వానలతో ఇంటర్‌నెట్ సేవలకు అంతరాయం కలగడంతో రవాణశాఖలో సేవలు నిలిచిపోయినట్లు జిల్లా రవాణ శాఖాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇతర సేవలకు స్లాట్ బుక్ చేసుకున్న వారు అనుకూలంగా మరో రోజుకు మార్చుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థి అదృశ్యం



శివ(ఫైల్)

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన ఇరుగందుల శివ (17) అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, సోమవారం కాలేజీకి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.